ఇండ్ల అమ్మకాలు ఢమాల్!

మొదటిపేజీ తరువాయి...

వ్యవధిలో 1,26,848 యూనిట్ల అమ్మకాలు జరిగినట్టు పేర్కొన్నది. దీంతో 18 శాతం పతనానికి అవకాశాలున్నట్టు ప్రాప్‌ఈక్విటీ తెలిపింది.



12వేల యూనిట్లకే పరిమితం

హైదరాబాద్‌లో ఈ జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో ఇండ్ల అమ్మకాలు 12,082 యూనిట్లుగా ఉండొచ్చని ప్రాప్‌ఈక్విటీ చెప్తున్నది. గత ఏడాది ఇదే వ్యవధిలో 20,658 యూనిట్ల విక్రయాలు జరిగాయన్నది. దీంతో తాజా సర్వేలో అన్ని నగరాల కంటే హైదరాబాద్‌లోనే అత్యంత క్షీణత నమోదవుతున్నది. గత ఏడాదిదాకా దేశంలోనే అత్యంత ఎక్కువగా ఇండ్ల అమ్మకాలు ఇక్కడ జరిగిన విషయం తెలిసిందే. ముంబై, బెంగళూరు వంటి నగరాలనూ దాటుకొని గడిచిన పదేండ్లలో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం దూసుకుపోయింది. కానీ ఇప్పుడు సీన్ రివర్సైంది.

హైడ్రా ఎఫెక్ట్!

తాజా గణాంకాలను చూస్తే.. హైదరాబాద్‌లో ఇండ్ల అమ్మకాల తగ్గుదలకు 'హైడ్రా' భయాలే కారణమన్న అభిప్రాయాలు గట్టిగా వినిపిస్తున్నాయి. కొందరు అక్రమార్కులు చేసిన పనికి మొత్తం నిర్మాణ రంగమే మందగమనంలోకి వెళ్లిపోయిందని రియల్టర్లు, అనుబంధ రంగాల వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ లే-అవుట్లతో అమాయక జనాలు ఆగమైపోయారని, కొత్తగా కొనేందుకూ ఎవరూ ఆసక్తి చూపడం లేదని అంటున్నారు. చెరువుల చుట్టుపక్కల్లో నైతే చాలా దూరం వరకు అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్లు, ఇండిపెండెంట్ హౌజ్‌లు, ఓపెన్ ప్లాట్ల జోలికి ఎవరూ వెళ్లడం లేదని, పెట్టిన పెట్టుబడులు ప్రశ్నార్థకంగా మారాయని ఆవేదన చెందుతున్నారు. పరిస్థితులు ఇలాగే సాగితే నిర్మాణ రంగం.. మళ్లీ కరోనా సంక్షోభం నాటి పరిస్థితుల్ని చూడకతప్పదన్న ఆందోళనల్నీ కనబరుస్తున్నారు. నిజానికి దసరా, దీపావళి పండుగల సమయాల్లో హౌజింగ్ సేల్స్ ఊపందుకుంటాయి. కానీ నగరంలో ఆ సంకేతాలేవీ కనిపించట్లేదిప్పుడు.

టెల్కోలకు బీఎస్ఎన్ఎల్ దెబ్బ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20: టెలికం చార్జీలను పెంచుతూ తీసుకున్న నిర్ణయం ప్రైవేట్ టెలికం సంస్థలకు గట్టి షాక్ తగిలింది. జూలై నెలలో జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలు కస్టమర్లను కోల్పోయారు. మొబైల్ సర్వీసు చార్జీలను 10-27 శాతం వరకు పెంచాయి. దీంతో కస్టమర్లు ఈ మూడు సంస్థలకు దూరంగా ఉన్నారు. ఇదే సమయంలో ప్రభుత్వరంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ నూతన కస్టమర్లను ఆకట్టుకోవడంలో ముందువరసలో నిలిచింది. టెలికం నియంత్రణ మండలి ట్రాయ్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. జూలైలో బీఎస్ఎన్ఎల్‌ను కొత్తగా 29.4 లక్షల మంది మొబైల్ సబ్‌స్క్రైబర్లు చేరారు. కానీ, భారతీ ఎయిర్‌టెల్ 16.9 లక్షల మంది మొబైల్ సబ్‌స్క్రైబర్లను కోల్పోగా, వొడాఫోన్ ఐడియా 14 లక్షలు, రిలయన్స్ జియో 7.58 లక్షల మందిని కోల్పోయింది. మొత్తం టెలికం సబ్‌స్క్రైబర్లు కూడా 120.56 కోట్ల నుంచి 120.51 కోట్లకు తగ్గడం విశేషం. మొబైల్ టారిఫ్‌లను పెంచడంతో ఏపీ సర్కిల్‌తోపాటు మహారాష్ట్ర, రాజస్థాన్, ముంబై, కోల్‌కతా, తమిళనాడు, పంజాబ్, యూపీల్లో అత్యధిక మంది మొబైల్ సబ్‌స్క్రైబర్లు తగ్గుముఖం పట్టారు. కానీ, బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్లలో మాత్రం బీఎస్ఎన్ఎల్ భారీ స్థాయిలో కస్టమర్లను కోల్పోయింది.

రాజేశ్ వయసు 25. ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగి. వ్యక్తిగత రుణం కోసం బ్యాంకులను ఆశ్రయిస్తే నిరాశే ఎదురైంది. ఆ డాక్యుమెంట్లు కావాలి.. ఈ ష్యూరిటీలు తేవాలంటూ బ్యాంక్ సిబ్బంది రకరకాల రూల్స్‌ను ముందటపెట్టారు మరి.

సతీశ్ వయసు 30. సొంతంగా ఓ షాపును నిర్వహిస్తున్నాడు. ఇంటి రుణం కోసం బ్యాంకులకు వెళ్తే మోత మోగించే వడ్డీరేట్లు చెప్పారు. ప్రాపర్టీకి సంబంధించి కూడా ప్రాంతం, విస్తీర్ణం, ప్లానింగ్, లే-అవుట్, అనుమతులంటూ పెద్ద చిట్టానే చదివారు. దీంతో వెనుదిరగాల్సి వచ్చింది.

ఇదీ.. ఇప్పుడు లోన్ కావాలంటూ బ్యాంకులకు చేరినవారికి ఎదురవుతున్న పరిస్థితి.. కాదు దుస్థితి. అవును.. ఆయా రుణాలపై బ్యాంకర్లు నిబంధనల్ని కఠినతరం చేశారు. దీంతో సామాన్యులకు పైసా కూడా అప్పు పుట్టకుండా పోతున్నది.

రుణాలకు దారేది

నిబంధనల్ని కఠినతరం చేసిన బ్యాంకులు
సామాన్యులకు పుట్టని అప్పులు
గృహ, వాహన, వ్యక్తిగత, విద్యా రుణాలు జటిలం
రకరకాల కొర్రీలతో ఏ లోన్లూ దొరకని వైనం
కీలక రంగాలపైనా పెను ప్రభావం

ముంబై, సెప్టెంబర్ 20: కార్పొరేట్లకు రెడ్‌కార్పెట్ వేసిమరీ వందలు, వేల కోట్ల రూపాయల్ని అప్పుగా ఇస్తున్న బ్యాంకర్లు.. సామాన్యులకు మాత్రం లక్ష కొర్రీలు పెడుతూ మొండిచెయ్యి చూపిస్తున్నారు. పెరుగుతున్న రిటైల్ రుణాలు ప్రమాద ఘంటికల్ని మోగిస్తున్నాయంటూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) చేసిన హెచ్చరికలతో అప్రమత్తమైన బ్యాంకింగ్ సంస్థలు.. నిబంధనల్ని కఠినతరం చేసేశాయి. ఈ ప్రభావం పెద్దలపై ఎలా ఉన్నా.. మధ్యతరగతివారిపై మాత్రం పెద్దగానే పడుతున్నది. లక్ష రూపాయల పర్సనల్ కోసం వెళ్లినా.. 10 లక్షల గృహ రుణం కోసం అడిగినా.. రూల్స్ మీద రూల్స్ చెబుతూ సగటు మనిషి గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి బ్యాంకులు. ముఖ్యంగా షూరిటీల కోసం నానా అగచాట్లు పడాల్సి వస్తున్నదని చాలా మంది వాపోతున్నారు.

ఎన్‌బీఎఫ్‌సీల్లోనూ..

బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల్లోనూ రుణగ్రహీతలకు ఇదే పరిస్థితి ఎదురవుతున్నది. ఇక ఉద్యోగేతరులపై వడ్డీభారం భారీగా పడుతున్నది. కొన్నైతే 14 శాతం నుంచి 22 శాతం మేర వసూలు చేస్తుండటం గమనార్హం. సిబిల్ స్కోర్, స్థిరాస్తి లావాదేవీల్లో సమస్యలనుబట్టి ఈ వడ్డీరేట్లుంటున్నాయి. నిజానికి మొండి బకాయి (నిరర్థక ఆస్తి లేదా ఎన్‌పీఏ)లు కార్పొరేట్ రుణాల్లోనే ఎక్కువ. రుణాల్ని ఎగవేసేదీ బడా వ్యాపార, పారిశ్రామికవేత్తలేనని ఎన్‌పీఏ గణాంకాలూ చెప్తున్నాయి. అయినప్పటికీ కఠినం చేసిన నిబంధనలు సామాన్య రుణగ్రహీతల్నే ఎక్కువగా ఇబ్బంది పెడుతున్నాయి.

మార్కెట్‌పై ప్రభావం

బ్యాంకింగ్ రుణాల లభ్యత లేక ఆటో, రియల్టీ, కన్స్యూమర్ గూడ్స్ మార్కెట్లలో నీరసం కనిపిస్తున్నది. వాహన, నిర్మాణ రంగాలపై ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నది. దీంతో ఆటో సంస్థలు ఆయా ఫైనాన్స్ కంపెనీలతో ప్రత్యేకంగా తమ వాహన అమ్మకాల కోసం జట్టు కడుతున్నాయి. బడా రియల్టర్లూ కస్టమర్లను ఆకట్టుకునేందుకు లోన్ మేళాల్ని నిర్వహిస్తున్నారు. అసలే ఆర్థిక మందగమనం ఛాయలు కనిపిస్తున్న తరుణంలో కఠిన బ్యాంకింగ్ నిబంధనలు మార్కెట్‌కు శరాఘాతంలా పరిణమిస్తున్నాయి. దీంతో రుణ ఎగవేతల్ని అడ్డుకునేందుకు చర్యలు తీసుకోవడం బాగానే ఉన్నా.. అతితో అనర్థాలేనని ఆర్థిక నిపుణులూ హెచ్చరిస్తున్నారు.

ఆదాయంపై అబద్ధాలు..

రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు ఆదాయాన్ని ఎక్కువగా పేర్కొనడం సాధారణంగా జరిగేదేనని ప్రతీ ఐదుగురు భారతీయుల్లో ముగ్గురు (63 శాతం) అభిప్రాయపడ్డట్టు ఓ తాజా సర్వే తెలిపింది. అయితే ఈ విషయంలో అంతర్జాతీయ సగటు 39 శాతంగానే ఉన్నది. గ్లోబల్ అనలిటిక్స్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఫికో.. దేశీయంగా నిర్వహించిన ఈ సర్వేలో ఉద్దేశపూర్వకంగానే గృహ, వ్యక్తిగత రుణాల కోసం తమ ఆదాయంపై అబద్ధాలు ఆడుతున్నట్టు 27 శాతం మంది స్పష్టం చేశారు. ఇక బీమా క్లెయిముల కోసం తప్పుడు సమాచారం ఇస్తున్నామని 54 శాతం అంగీకరించారు. కానీ 33 శాతం మంది ఈ రకమైన తీరు అస్సలు ఆమోదయోగ్యం కాదంటున్నారు. వారంతా ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నారని చెప్పారు. కాగా, 35 శాతం మాత్రం తప్పనిసరి పరిస్థితుల్లో అబద్ధాలు ఆడితే తప్పేమిటన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

గోద్రేజ్ ఇంటిరియో విస్తరణ

హైదరాబాద్, సెప్టెంబర్ 20: గోద్రేజ్ ఇంటిరియో..తన వ్యాపారాన్ని శరవేగంగా విస్తరిస్తున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 104 నూతన స్టోర్లను తెరవబోతున్నట్లు కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ దేవ్ నారాయణ్ సర్కార్ తెలిపారు. తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్‌లలో 10 ప్రత్యేకంగా గృహోపకరణాల విక్రయ అవుట్‌లెట్లను తెరుస్తున్నట్లు ప్రకటించారు. ప్రస్తుత పండుగ సీజన్‌ను దృష్టిలో పెట్టుకొన్ని అన్ని రకాల ఉత్పత్తులపై 35 శాతం వరకు రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు.

ఎల్ ఐసీ ఫండ్ కొత్త స్కీం

ముంబై, సెప్టెంబర్ 20: ఎల్ఐసీ మ్యూచువల్ ఫండ్ తాజాగా నూతన ఫండ్ స్కీంను ప్రారంభించింది. కంపెనీల కోసం ప్రారంభించిన ఈ ఫండ్ స్కీం వచ్చే నెల 4 వరకు తెరిచివుంటుందని, అదే నెల 11న కేటాయింపులు జరపనున్నట్లు పేర్కొంది.

సెన్సెక్స్ @ 84,000

సెన్సెక్స్ 1,360, నిఫ్టీ 375 పాయింట్ల లాభం • 6.24 లక్షల కోట్లు పెరిగిన సంపద

ముంబై, సెప్టెంబర్ 20: దేశీయ స్టాక్ మార్కెట్లు మరో మైలురాయిని అధిగమించాయి. రోజుకొక రికార్డును బద్దలు కొడుతున్న సూచీలు శుక్రవారం 84 వేల మైలురాయిని అధిగమించి చారిత్రక గరిష్ఠ స్థాయిలో ముగిసింది. బ్యాంకింగ్ రంగ సూచీలు భారీగా పుంజుకోవడంతోపాటు అమెరికా, ఆసియా మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు సూచీల్లో జోష్ పెంచింది. ఇరు సూచీలు ఆల్‌టైం రికార్డు స్థాయిలో ముగియడం విశేషం. ఇంట్రాడేలో 1,500 పాయింట్లకు పైగా లాభపడి 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 1,359.51 పాయింట్లు(1.63 శాతం) అందుకొని చారిత్రక గరిష్ఠ స్థాయి 84,544.31 వద్ద ముగిసింది. అటు మరో సూచీ నిఫ్టీ సైతం 26 వేల దిశగా పయనిస్తున్నది. మార్కెట్ ముగిసే సమయానికి నిఫ్టీ 375 పాయింట్లు అందుకొని 25,791 దగ్గర స్థిరపడింది. గతవారంలోనే 83 వేల మార్క్‌ను అధిగమించిన సెన్సెక్స్ కేవలం ఐదు ట్రేడింగ్ రోజుల్లోనే మరో మైలురాయి 84 వేల మార్క్‌ను చేరుకోవడం విశేషం. దీంతో మదుపరుల సంపద మరో 6 లక్షల కోట్లకు పైగా పెరిగింది. పెట్టుబడిదారులు ఎగబడి కొనుగోళ్లు జరపడంతో సూచీలతోపాటు మదుపరుల సంపద కూడా అమాంతం పెరిగింది. ఈక్విటీల ర్యాలీతో బీఎస్ఈలో లిస్టైన కంపెనీల విలువ రూ.6,24,468.11 కోట్లు పెరిగి రూ.4,71,71,745.83 కోట్లు(5.65 ట్రిలియన్ డాలర్లకు) చేరుకున్నది.

- మహీంద్రా అండ్ మహీంద్రా షేరు 5 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది.
- దీంతోపాటు జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఐసీఐసీఐ బ్యాంక్, లార్సెన్ అండ్ టుబ్రో, భారతీ ఎయిర్‌టెల్, అదానీ పోర్ట్స్, హెచ్‌యూఎల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మారుతి, కొటక్ మహీంద్రా బ్యాంక్, టాటా స్టీల్‌లు లాభపడిన షేర్లలో ఉన్నాయి.
- కానీ, ఎస్బీఐ, ఇండస్‌ఇండ్, టీసీఎస్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు నష్టపోయాయి.
- రియల్టీ అత్యధికంగా 3.21 శాతం, క్యాపిటల్ గూడ్స్ 2.32 శాతం, ఆటో 2.12 శాతం, ఇండస్ట్రియల్స్ 2.08 శాతం, మెటల్ 1.82 శాతం, కన్స్యూమర్ 1.78 శాతం లాభపడ్డాయి.

పసిడి పరుగు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20: బంగారం ధరలు మళ్లీ పరుగెత్తుతున్నాయి. ఫెడ్ వడ్డీరేట్లను అర శాతం తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయంతో అంతర్జాతీయ పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను ఒక్కసారిగా అతి విలువైన లోహాలవైపు మళ్లించడంతో వీటి ధరలు పుంజుకుంటున్నాయి. ఢిల్లీలో తులం బంగారం ధర రూ.700 అధికమై రూ.76,350 పలికింది. కానీ వెండి రూ.91 వేల వద్ద స్థిరంగా ఉన్నది. బంగారం ధరలు పెరగడం వరుసగా ఇది మూడోరోజని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. ఇటు హైదరాబాద్‌లో 24 క్యారెట్ తులం పుత్తడి ధర రూ.660 ఎగబాకి రూ.75,110కి చేరుకున్నది. 22 క్యారెట్ ధర రూ.600 అధికమై రూ.68,850 పలికింది. మరోవైపు, వెండి పరుగులు పెట్టింది. కిలో వెండి ధర ఏకంగా రూ.1,500 అధికమై రూ.97,500కి చేరుకున్నది.

చిరంజీవికి ఏఎన్ఆర్ నేషనల్ అవార్డ్

31నగరాల్లో అక్కినేని ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నాం: నాగార్జున

నట సామ్రాట్, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత అక్కినేని నాగేశ్వరరావు శత జయంతిని పురస్కరించుకొని ఫిల్మ్ హెరిటేజ్ ఫౌండేషన్, నేషనల్ ఫిల్మ్ ఆర్కైవ్ ఆఫ్ ఇండియాతో కలిసి 'ఏఎన్ఆర్-100 కింగ్ ఆఫ్ ది సిల్వర్ స్క్రీన్' పేరుతో ఫిల్మ్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తోంది. ఏఎన్ఆర్ ఐకానిక్ ఫిల్మ్ 'దేవదాసు' స్క్రీనింగ్‌తో శుక్రవారం ఈ చిత్రోత్సవాన్ని ఘనంగా ప్రారంభించారు. అక్కినేని నాగేశ్వరరావు పేరుతో పోస్టల్ స్టాంప్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా అక్కినేని నాగార్జున మాట్లాడుతూ 'దేశవ్యాప్తంగా 31నగరాల్లో ఈ ఫిల్మ్ ఫెస్టివల్‌ను నిర్వహించబోతున్నాం. గోవా ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో నాన్నగారి పేరు మీద ఓ ఛాప్టర్ చేస్తున్నాం. ఈ ఏడాది ఏఎన్ఆర్ నేషనల్ అవార్డును చిరంజీవిగారికి ఇవ్వాలని నిర్ణయించాం. ఈ విషయం చెప్పగానే ఆయన చాలా ఎమోషనల్‌గా ఫీలయ్యారు. అక్టోబర్ 28న అమితాబ్ బచ్చన్ గారు ఈ అవార్డును చిరంజీవికి ప్రదానం చేస్తారు.' అని అన్నారు. ఈ కార్యక్రమంలో మురళీమోహన్, రాఘవేంద్రరావు, శివేంద్ర సింగ్ దుంగార్పూర్, వెంకట్ అక్కినేని, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అక్కినేని ఫిల్మ్ ఫెస్టివల్‌లో దేవదాసు, మిస్సమ్మ, మాయాబజార్, భార్యభర్తలు, గుండమ్మ కథ, డాక్టర్ చక్రవర్తి, సుడిగుండాలు, ప్రేమ్‌నగర్, ప్రేమాభిషేకం, మనం చిత్రాలను ప్రదర్శించనున్నారు.

వారి మాటలు పట్టించుకోలేదు

దేశవ్యాప్తంగా అలియాభట్‌కు ఉన్న ఫాలోయింగ్ సామాన్యమైనది కాదు. నేటి యువతరానికి అభిమాన నాయికగా అవతరించింది అలియా. ఆమె ఇమేజ్ జయాపజయాలకు అతీతం. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో కెరీర్ ఆరంభంలో తాను ఎదుర్కొన్న సమస్యల గురించి ఆసక్తికరంగా చెప్పుకొచ్చింది అలియా. 'నేను చిన్నప్పట్నుంచి కాస్త బొద్దు. నా లుక్ గురించి నేనెప్పుడూ ఫీలవ్వలేదు కూడా. కానీ హీరోయిన్ అవ్వాలనుకున్నప్పుడు మాత్రం నన్ను నేను మార్చుకోవాల్సి వచ్చింది. దానికోసం చాలా కష్టపడ్డా. సరిగ్గా తినేదాన్ని కాదు, జిమ్‌లో గంటల తరబడి చమటోడ్చేదాన్ని. నా డైట్ చూసి నా ఫ్రెండ్స్ భయపడేవాళ్లు. 'డైటింగ్ ఆపేయ్.. నచ్చింది తిను. ప్రశాంతంగా ఉండు. ఎందుకీ అవస్థ..' అంటూ నచ్చజెప్పేందుకు ప్రయత్నించేవారు. నేను మాత్రం వారి మాటల్ని అస్సలు ఖాతరు చేసేదాన్ని కాదు. బరువు తగ్గాక అందులో ఉండే ఆనందం ఏంటో అర్థమైంది. ఇక బరువు విషయంలో కంట్రోల్‌గా ఉండాలని నిర్ణయించుకున్నా' అని గుర్తు చేసుకున్నది అలియా భట్.

యుద్ధానికి సన్నద్ధం

ఎట్టకేలకు 'హరిహరవీరమల్లు' లొకేషన్‌లోకి పవన్ కల్యాణ్ అడుగుపెట్టనున్నారు. ఈ నెల 23 నుంచి ఈ సినిమా తాజా షెడ్యూల్ విజయవాడలో మొదలుకానుంది. గ్లాడియేటర్, బోర్న్ ఐడెంటిటీ, ది లాస్ట్ సమురాయ్ వంటి లెజెండ్రీ మూవీస్‌కి పనిచేసిన హాలీవుడ్ దిగ్గజ యాక్షన్ దర్శకుడు నిక్ పావెల్ ఆధ్వర్యంలో భారీ యుద్ధ సన్నివేశాలను ఈ షెడ్యూల్‌లో చిత్రీకరించనున్నట్టు నిర్మాతలు తెలిపారు. 'పవన్‌కల్యాణ్‌తోపాటు నాజర్, రఘుబాబు, సునీల్, అభిమన్యుసింగ్, అయ్యప్ప తదితరులు ఈ షెడ్యూల్‌లో భాగం కానున్నారు. 400మంది సిబ్బంది, భారీ సంఖ్యలో జూనియర్ ఆర్టిస్టులు, ఫైటర్లతో మునుపెన్నడూ చూడని స్థాయిలో యుద్ధ సన్నివేశాలను చిత్రీకరించేందుకు దర్శకుడు జ్యోతికృష్ణ ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ షెడ్యూల్‌తో ఈ సినిమా షూటింగ్ తుదిదశకు చేరుతుంది' అని నిర్మాతలు చెప్పారు. నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో బాబీ డియోల్ ప్రతినాయకుని పాత్ర పోషిస్తున్నారు. బాలీవుడ్ దిగ్గజ నటుడు అనుపమ్‌ఖేర్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి కెమెరా: మనోజ్ పరమహంస, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, కళ: తోట తరణి, నిర్మాతలు: ఎ.దయాకర్‌రావు, ఎ.ఎం.రత్నం. నిర్మాణం: మెగా సూర్య ప్రొడక్షన్స్.

ఆర్జీవీ సైకలాజికల్ థ్రిల్లర్

నిజజీవిత సంఘటనల మేళవింపుతో రామ్‌గోపాల్‌వర్మ అందిస్తున్న సైకలాజికల్ థ్రిల్లర్ 'శారీ'. 'టూమచ్ లవ్ కెన్ బి స్కేరీ' అనేది ఉపశీర్షిక. గిరి కృష్ణకమల్ దర్శకుడు. రవివర్మ నిర్మాత. నవంబర్‌లో విడుదల కానున్న ఈ సినిమా ఆంధ్ర, తెలంగాణ థియేట్రికల్ హక్కులను ప్రముఖ పంపిణీ దారుడు ముత్యాల రాందాస్ సొంతం చేసుకున్నారు. చీరలో ఉన్న ఓ అమ్మాయిని చూసి పిచ్చివాడై, ప్రేమలో పడ్డ ఓ అబ్బాయి జీవితం ఎలా భయానకంగా మారింది అన్నదే ఈ సినిమా ప్రధానాంశం. ఇందులో అబ్బాయిగా సత్య యాదు నటిస్తుండగా, అతన్ని పిచ్చివాడ్ని చేసిన అమ్మాయిగా ఆరాధ్యదేవి కనిపించనుంది. వాస్తవ సంఘటనలను కళ్లకు కట్టేలా చూపించడంలో ఆర్జీవీ సిద్ధహస్తులనీ, యువతరం మాత్రమే కాకుండా, కుటుంబ ప్రేక్షకులకు కూడా నచ్చేలా ఈ సినిమాను ఆర్జీవీ మలిచారని పంపిణీదారులు ముత్యాల రాందాస్ అన్నారు. పాన్ ఇండియా స్థాయిలో సినిమాను విడుదల చేస్తున్నామని నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: శబరి, నిర్మాణం: ఆర్జీవి ఆర్వి ప్రొడక్షన్స్.

మునుపెన్నడూ చూడని మాస్ అవతార్‌లో

యువహీరో సాయిదుర్గతేజ్ కథానాయకుడిగా ఓ యాక్షన్ ఎంటర్‌టైనర్ తెరకెక్కుతున్నది. రోహిత్ కె.పి దర్శకత్వం వహిస్తున్న ఈ భారీ పాన్ ఇండియా సినిమాకు 'హను-మాన్'ఫేం కె.నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి నిర్మాతలు. ఈ సినిమాకు సంబంధించిన భారీ యాక్షన్ సన్నివేశాలను 15రోజుల పాటు తెరకెక్కించారు. నెక్ట్స్ షెడ్యూల్ కోసం 12 ఎకరాల్లో భారీ సెట్‌ను నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో సాయిదుర్గతేజ్ మునుపెన్నడూ చూడని పవర్‌ఫుల్ మాస్ అవతార్‌లో కనిపిస్తారని, భారీ వ్యయంతో, అత్యున్నత సాంకేతిక విలువలతో తెరకెక్కుతున్న ఈ సినిమా సాయిదుర్గతేజ్ కెరీర్‌లోనే మెమరబుల్ సినిమాగా నిలుస్తుందని మేకర్స్ తెలిపారు. ఐశ్వర్యలక్ష్మి కథానాయికగా నటిస్తున్న ఈ పాన్ ఇండియా సినిమాకు సంబంధించిన మిగతా వివరాలు త్వరలో తెలియజేస్తామని వారు చెప్పారు. ఈ చిత్రానికి నిర్మాణం: ప్రైమ్‌షో ఎంటర్టైన్మెంట్.

అమ్మాయి భయపడితే?

'డైరెక్టర్ హరిత అందరికీ నచ్చేలా ఈ సినిమాను తీశారు. డైరెక్టర్‌గా ఇది ఆమె తొలి సినిమా అంటే ఎవరూ నమ్మరు. ఈ సినిమాలో చేసిన రోల్ నటిగా నాకు సంతృప్తినిచ్చింది. అనూప్‌రూబెన్స్ బీజీఎం ఈ సినిమాకు ప్రాణం పోసింది. ఈ సినిమాకు విడుదలకు ముందే 64 ఇంటర్నేషనల్ ఫిల్మ్ అవార్డులొచ్చాయి. ప్రేక్షకులకు కూడా తప్పక నచ్చుతుంది' అని హీరోయిన్ వేదిక నమ్మకం వ్యక్తం చేశారు. ఆమె లీడ్ రోల్ చేసిన చిత్రం 'ఫియర్'. అరవింద్ కృష్ణ ప్రత్యేకపాత్ర పోషించారు. హరిత గోగినేని దర్శకత్వంలో ఏఆర్ అభి నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ప్రచారంలో భాగంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా టీజర్ రిలీజ్ ఈవెంట్‌లో వేదిక మాట్లాడారు. 'ఈ సినిమాలోని కథానాయిక పాత్రకు నేను కోరుకున్న అన్ని అర్హతలు ఉన్న నటి వేదిక. అందుకే ఆమెను తీసుకున్నా. అనూప్ తన మ్యూజిక్ ద్వారా నటిగా వేదికను, డైరెక్టర్‌గా నన్నూ డామినేట్ చేశారు. అది రేపు తెరపై చూస్తారు. జీవితంలో కొన్ని అనుకోని సందర్భాల్లో ఒక అమ్మాయి భయపడితే పర్యావసానాలు ఎలా ఉంటాయి అనేదే 'ఫియర్' కథ. వచ్చే నెలలో సినిమాను విడుదల చేస్తాం' అని డైరెక్టర్ హరిత గోగినేని తెలిపారు.

లడ్డుగాని పెళ్లి హంగామా

గత ఏడాది 'మ్యాడ్' చేసిన అల్లరి అంతాఇంతా కాదు. బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని నమోదు చేసిందీ సినిమా. ఇప్పుడు ఆ అల్లరిని డబుల్ చేస్తూ మ్యాడ్ మ్యాక్స్ ఎంటర్‌టైనర్‌గా 'మ్యాడ్ స్క్వేర్'ను తీసుకొస్తున్నది ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్టైన్మెంట్స్. కల్యాణ్ శంకర్ దర్శకత్వంలో వహిస్తున్న ఈ సీక్వెల్‌పై ప్రకటనతోనే భారీ అంచనాలు ఏర్పడ్డాయి. శుక్రవారం 'లడ్డు గాని పెళ్లి' పాటతో మేకర్స్ ప్రచారాన్ని షురూ చేశారు. కాసర్ల శ్యామ్ రాసిన ఈ పాటను భీమ్స్ సిసిరోలియో స్వరపరిచి, మంగ్లీతో కలిసి ఆలపించారు. ఈ పాట ప్రస్తుతం విశేషంగా ఆదరణ పొందుతున్నదని, 'మ్యాడ్' పాటల్ని మించే స్థాయిలో 'మ్యాడ్ స్క్వేర్' పాటలు ఉంటాయని మేకర్స్ చెబుతున్నారు. సంగీత్ శోభన్, నార్నే నితిన్, రామ్ నితిన్ ఈ పాటలో ఎంత జోష్‌గా కనిపించారో.. అంతకు రెట్టింపు జోష్‌తో సినిమాలో ఉంటారని, 'మ్యాడ్ స్క్వేర్' పేరుకు తగ్గట్టే డబుల్ వినోదాన్ని ఇవ్వడం ఖాయమని మేకర్స్ చెబుతున్నారు. త్వరలో విడుదల కానున్న ఈ సినిమాకు కెమెరా: షామ్‌దత్, నిర్మాతలు: హారిక సూర్యదేవర, సాయిసౌజన్య, సమర్పణ: సూర్యదేవర నాగవంశీ.

ఏం పాపం చేశామో..

సుహాస్, సంగీర్తన జంటగా నటించిన ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'జనక అయితే గనక'. సందీప్ రెడ్డి బండ్ల దర్శకుడు. దిల్‌రాజు ప్రొడక్షన్స్ పతాకంపై హర్షితరెడ్డి, హన్షితరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. శిరీష్ సమర్పకుడు. దసరా కానుకగా అక్టోబర్ 12న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రమోషన్ వేగవంతం చేశారు. ఇప్పటికే పోస్టర్లు, పాటలు, టీజర్ విడుదల చేశారు. తాజాగా 'ఏం పాపం చేశామో..' అంటూ సాగే పాటను మేకర్స్ విడుదల చేశారు. కృష్ణకాంత్ రాసిన ఈ పాటను విజయ్ బుల్గానియా స్వరపరచగా, రితేజ్ జి. రావు ఆలపించారు. మిడిల్‌క్లాస్ ఉద్యోగి మేనేజర్‌తో పడే తంటాలు, చాలీచాలని జీతాలవల్ల ఎదురయ్యే కష్టాలు.. ఇవన్నీ ఈ పాటలో ఫన్నీగా చూపించారు. అందరికీ నచ్చే సినిమాగా 'జనక అయితే గనక' నిలుస్తుందని మేకర్స్ నమ్మకం వెలిబుచ్చారు.